

అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
08 పేజీలు | గురువారం 16 నవంబర్ 2023 | www.navatelangana.com

అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ

- కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి అభ్యర్థి మదన్ మోహన్ రావు



8లో...

స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు చురుగ్గా పనిచేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్
- తనిఖీ కేంద్రాల సందర్శన




2లో...



నిజామాబాద్‌లో అభివాదం చేస్తున్న కేసీఆర్, బిగాల గణేశ్‌గుప్త

అన్యాయం చేసిన వారికి అవకాశమిద్దామా..?

- కాంగ్రెస్ వస్తే ధరణి బంగాళాఖాతంలోకి.. రైతులు అరేబియా సముద్రంలోకే
- పదేండ్ల పాలనలో మత కల్లోలాలు, కర్ఫ్యూ జరిగాయా..? ● బీఆర్ఎస్ నూరుశాతం లౌకికపార్టీ
- బీడీకార్మికులకు పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- దళారుల రాజ్యం కావాలో.. సంక్షేమం రాజ్యం రావాలో తేల్చుకోండి : ప్రజాఆశీర్వాద సభల్లో కేసీఆర్



ఎల్లారెడ్డిలో కేసీఆర్, సురేందర్

నవతెలంగాణ-బోధన్/కంఠేశ్వర్/లింగంపేట్

'ఉన్న తెలంగాణను ఊడగొట్టిందే కాంగ్రెస్.. ఆ పార్టీ అనాలోచిత నిర్ణయం వల్లే 58 ఏండ్లు గోస పడ్డాం. బంగారం లెక్క ఉన్న రాష్ట్రాన్ని ఇక్కడి ప్రజలకు ఇష్టం లేకున్నా నాడు ఆంధ్రప్రదేశ్‌లో కలిపింది. 400 మందిని పొట్టనపెట్టుకుంది. 2004లో తెలంగాణ ఇస్తా అని బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకొని.. మా పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి పార్టీ అస్తిత్వాన్నే దెబ్బతీయాలని చూసింది. తర్వాత అనేక పోరాటాలతో, బలిదానాలతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయింది. తెలంగాణకు తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇద్దామా..? ఇచ్చి మళ్లీ దళారుల రాజ్యం తీసుకొద్దామా.? 60 ఏండ్ల పాలనలో తెలంగాణ ఎట్లుండే.. 10 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలా మారిందో ప్రజలే ఆలోచించాలి. మోసపోతే గోస పడతాం. అభ్యర్థులు ఎవరు బరిలో నిలిచారు.. వారి వెనకున్న పార్టీని చూసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని' సీఎం కేసీఆర్ కోరారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బోధన్, నిజామాబాదర్ అర్బన్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో బుధవారం ప్రజాఆశీర్వాద సభలకు హాజరైయ్యారు. ఆ పార్టీ అభ్యర్థులు షకీల్, బిగాల గణేశ్‌గుప్త, జాజాల సురేందర్‌కు మద్దతుగా ప్రచార సభల్లో పాల్గొని ప్రసంగించారు.

'ఉద్యమ సమయంలో ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా రాజీనామా చేయలేదు. ఉద్యమంలో మనతో కలిసి రాలేదు. అసెంబ్లీలో రూపాయి కూడా ఇవ్వను అని కిరణ్ కుమార్ రెడ్డి అంటే రోషంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒక్కడు కూడా రాజీనామా చేయలేదు. వారు నోరు మూసుకున్నారు కాబట్టే 58 ఏండ్లు తెలంగాణ నాశనం కావాల్సి వచ్చింది. మళ్లీ ఇవాళ పెద్ద ప్రమాదం పొంచి ఉంది. అందుకే ఆషామాషీగా ఓటు వేయొద్దు' అని కేసీఆర్ అన్నారు.



ఎల్లారెడ్డిలో హాజరైన జనం

'ధరణి, రైతుబంధు ఎత్తేస్తాం.. 24 గంటల కరెంట్‌కు బదులు 3 గంటల కరెంట్ ఇస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఈ మూడు ఎత్తేస్తే రైతాంగం తీవ్రంగా నష్టపోతారు. ఈ మూడింటింతో రైతుల ముఖం తెల్లవడుతుంది. గ్రామాలకు వాపస్ వచ్చి వ్యవసాయం చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి కూడా గ్రామాలకు వస్తున్నారు. అంతకు ముందు 20 ఎకరాలు భూమి ఉన్నోడికి పిల్లను ఇవ్వలేదు. చప్రాసీ నౌకరి ఉన్నోడికి పిల్లను ఇచ్చారు. ఇవాళ అడుగుతున్నారు.. భూమి ఉంటే పిల్లను ఇస్తున్నారు. ఇప్పుడు అలా భూమి విలువ పెరిగింది. ఎక్కడికి పోయినా ఆదిలాబాద్ బోర్డర్‌లో కూడా ▸ మిగతా 2లో...

తేలిన అభ్యర్థులు.. తేలాల్సింది భవితవ్యం

- నామినేషన్‌ల ఉపసంహరణ పూర్తి
- కామారెడ్డిలో అత్యధికంగా బరిలో 39 మంది
- బాన్సువాడలో ఏడుగురే పోటీ



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/మద్నూర్

ఎన్నికల ప్రక్రియలో రెండో ఘట్టం పూర్తయింది. నామినేషన్‌ల ఉపసంహరణతో బరిలో నిలిచే అభ్యర్థులు తేలగా.. వారి భవితవ్యం తేలాల్సి ఉంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 9 నియోజకవర్గాలకు గాను మొత్తం 238 నామినేషన్‌లు దాఖలు కాగా.. స్క్రూట్నీలో 40 నామినేషన్‌లు తిరస్కరణకు గురైయ్యాయి. నామినేషన్‌ల ఉపసంహరణ చివరి రోజు బుధవారం 9 నియోజకవర్గాలకు గాను 54 మంది అభ్యర్థులు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 144 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే బాన్సువాడ, ఏడుగురు మాత్రమే బరిలో నిలవగా, కామారెడ్డిలో అత్యధికంగా 39 మంది పోటీ పడుతున్నారు. 2లో...

బీజేపీని, దాన్ని సమర్థించే పార్టీలను ఓడించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీజేపీని, దాన్ని సమర్థించే పార్టీలను ఓడించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు. పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన పార్టీ కార్యకర్తల సభ్యుల విస్తృత సమావేశంలో రమేశ్‌బాబు హాజరై మాట్లాడారు. పేద ప్రజలపై నిత్యవసర సరుకుల ధరలను మోపిన బిజెపి పార్టీ ప్రజా సంపదతో ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్ కంపెనీలకు లాభాలను తెచ్చే పద్ధతుల్లో నిర్ణయాలు చేయటం మూలంగా ప్రజల పైన భారాలు పెరిగిపోయాయని తెలిపారు. ఈనెల 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో బిజెపిని ఓడించటానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని బిజెపిని సమర్థించే వ్యక్తులను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదలకు ఇచ్చిన ఇన్ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇండ్ల స్థలాల హామీని మరిచిందని దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని ఆయన అన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని వ్యక్తులను ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ రాములు మాట్లాడుతూ.. ▸ మిగతా 2లో...

c m y k

స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు

చురుగ్గా పనిచేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ లు చురుకుగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం నిజాంసాగర్ రోడ్‌లోని చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వేలెన్స్ బృందం నిర్వహిస్తున్న విధులను తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఎన్నికల వేడి పుంజుకుంటున్న సందర్భంగా పెద్ద మొత్తంలో అక్రమంగా నగదు, మద్యం లేదా అనుమానాస్పదంగా వస్తువులు తరలిస్తుంటే తనిఖీ చేసి స్వాధీనం చేసుకోవాలని, వీటంతటిని విడియోగ్రఫీ చేసి డాక్యుమెంట్లను సాక్ష్యాలుగా భద్రపరచాలన్నారు. కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ ద్వారా 24 గంటలు పర్యవేక్షిస్తుంటామని, ఏ ఒక్క వాహనాన్ని వదలక ప్రతిదీ తనిఖీ చేస్తూ, మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారాన్ని సంబంధీత నోడల్ అధికారులకు తెలపాలన్నారు.

బీజేపీని, దాన్ని సమర్థించే పార్టీలను ఓడించాలి

-మొదటిపేజీ తరువాయి

మతోన్మాద భావజాలాన్ని పెంచి రాజకీయాల కోసం వాడుకోవటం సరైంది కాదని మతతత్వ విధానాలను అనుసరించే బిజెపిని, ఎంఐఎంను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి పెద్దిసూరి, నగర నాయకులు సుజాత, కటారి రాములు, నరసయ్య, డి కృష్ణ, అనసూయమ్మ, మునవర్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

నేటినుండి ఓటరు స్లిప్పులు పంపిణీ

సెక్టోరియల్ అధికారుల సమీక్ష సమావేశం

నవతెలంగాణ-బాల్కొండ



మాట్లాడుతున్న అధికారులు

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బుధవారం బాల్కొండ మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, బూత్ లెవల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 16 నుండి 19 వరకు ఇంటింటా సందర్శించి పోలింగ్ స్టేషన్ పరిధిలోగల ఓటర్లకు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలని బూత్ లెవెల్ అధికారులకు, సూపర్వైజర్లకు ఆదేశించారు. సమావేశంలో నాయబ్ తహసీల్దార్ వినోద్, సెక్టోరియల్ అధికారులు బాల్కొండ ఎంపీడీవో సంతోష్ కుమార్, ఏఏఈ మాధవి, మండల గిర్దావర్ రాఘవేందర్, రెవెన్యు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బరిలో నిలిచిన అభ్యర్థులు

నియోజకవర్గం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	బీఎస్పీ	ఇతరులు
ఆర్మూర్	ఆశన్నగారి జీవన్‌రెడ్డి	పొద్దుటూరి వినయ్‌రెడ్డి	పైడి రాకేశ్‌రెడ్డి	గండికోట రాజన్న	ప్రేమ్‌కుమార్, శంకరయ్య, రామకృష్ణరెడ్డి, ఎస్‌కే మాజిద్ రవి, కోటగిరి శ్రీనివాస్, ఎం.గంగాధర్, ప్రణయ్‌గౌడ్ సుంకెం శ్రీనివాస్
బోధన్	షకిల్ ఆమేర్	సుదర్శన్‌రెడ్డి	వడ్డి మోహన్‌రెడ్డి	అమర్‌నాథ్‌బాబు	డి.నాగరాజు, మురళి శ్యాం, మోసిన్, రజిత వాణి, శార్జిల్ పర్వేస్, హెచ్ భూపాల్‌రెడ్డి, జునైద్ అహ్మద్ ఖలీల్ షేక్ జలీల్, సయ్యద్ అజ్గర్, కె.సుదర్శన్‌రాజ్
జుక్కల్(ఎస్సీ)	హన్మంత్‌షిండే	లక్ష్మికాంతరావు	అరుణతారా	ప్రజ్ఞాకుమార్	కాశీనాథ్, జి.రాజు, ఆర్.బాబు, బి.సాయిలు, భూమయ్య వి.గంగాధర్, బి.అనిల్‌కుమార్, జి.విఠల్, జి.సంజీవ్ జి. ప్రకాశ్, జి.ప్రేమ్‌కుమార్, జి.లక్ష్మి, జే.శ్యామల,
బాన్సువాడ	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	ఏనుగు రవీందర్‌రెడ్డి	యెండల లక్ష్మినారాయణ	నీరడి ఈశ్వర్	తోట శ్రీకాంత్, పుట్ట భాస్కర్, అమర్‌సింగ్
ఎల్లారెడ్డి	జాజాల సురేందర్	మదన్‌మోహన్ రావ్	వడ్డెపల్లి సుభాశ్‌రెడ్డి	జమునా రాథోడ్	జైకుమార్, బాలరాజు, ఎం.సుభాశ్, బి.శ్రీనివాస్, ఎస్.లక్ష్మయ్య, అమర్‌సింగ్, సంజీవ్‌లు
కామారెడ్డి	కేసీఆర్	రేవంత్‌రెడ్డి	వెంకట రమణారెడ్డి	యూ.సురేశ్‌గౌడ్	హనుమంతు, భోలేశ్వర్, కె.ప్రసన్న, కె.రాజు, కోటగిరి శ్రీనివాస్, దండు ధనుంజయ్, పి.నర్సింహో నరేందర్, బాబు, ఎమ్‌డి ఆరీఫ్, సిరిగాద సిద్దిరాములు, నరేశ్, హరిశ్ కటికం సంగారెడ్డి, కంటె సాయన్న, కుంట రవి, నాగేందర్, చంద్రశేఖర్, పరుశురాములు, అంజల్‌రెడ్డి, రాజేందర్, నాయక్, నాగరాజు, బంతిలాల్ మంజ, బి.శివ, బి.నర్సింలు, ఎం.భార్గవి, ఎమ్‌డి ఖలీల్, తాహెర్‌బిన్ అహ్మద్, ఎం.తిరుపతి, రవినాయక్, ఆర్.సంతోష్‌రెడ్డి, ఆర్.కొండయ్య, జి.వెంకన్న, షేక్ అబ్దుల్ వాహిద్, హసన్
నిజామాబాద్ అర్బన్	బిగాల గణేశ్‌గుప్త	షబ్బీర్‌అలీ	ధన్‌పాల్ సూర్యనారాయణ	షేక్ ఇమ్రాన్	ఎమ్‌డి అజిమ్, రాంపల్లి శ్రీనివాస్, లక్క అశోక్, సంజీవ్, ఫజల్ ఖరీం, ఎం.రాజ్‌కుమార్, నరేందర్‌గౌడ్, ఎన్.రాజేశ్ వై.కన్నయ్యగౌడ్, దండి లత, రాగి అనిల్, ఓం శకర్, దత్తురామ్, పడకంటి రామ్, బాదావత్ లలిత, జహీరుద్దీన్, ఎమ్‌డి. మన్సూర్ అలీ,
ని. రూరల్	బాజిరెడ్డి గోవర్ధన్	రేకులపల్లి భూపతిరెడ్డి	దినేశ్ కులాచారి	మటంల శేఖర్	తోట శ్రీనివాస్, ప్రసన్నకుమార్, మైత్రి రాజశేఖర్, రావుట్ల ప్రశాంత్, ఆరా సురేశ్, రాజేశ్వర్, శివరాం, బిబినాయక్, బాల్‌రాజ్ గుగులోత్, బొడ్డు గంగారెడ్డి
బాల్కొండ	వేముల ప్రశాంత్‌రెడ్డి	ముత్యాల సునిల్‌కుమార్	అన్నపూర్ణమ్మ	పల్లికొండ నర్సయ్య	ఎం. భోజన్న, అశోక్, శ్రీనివాస్, రాజేశ్వర్,

అన్యాయం చేసిన వారికి అవకాశమిద్దామా..?



నిజామాబాద్‌లో హాజరైన జనం

-మొదటిపేజీ తరువాయి

ఎకరా భూమి ధర 25 లక్షలు ఉంది. ఐదు ఎకరాలు ఉన్న రైతు కోటీశ్వరుడు అయిపోతుండు. ఎల్లారెడ్డిలో మూడు ఎకరాలు ఉంటే కోటీశ్వరుడు అయితుండు అని సురేందర్ చెబుతున్నాడు. వ్యవసాయ స్థిరికరణ జరిగి రైతులు కుదుటపడ్డారు. ఒక ఐదు, పదేండ్లు ఇవన్నీ అమలవుతే బాధ లేకుండా పోతది. మొండిపట్టుగా ఇవన్నీ చేశాను. రైతుల బాధలు నాకు తెలుసు' అని చెప్పారు.

30 లక్షల 10 హెచ్‌పీ మోటార్లు కొనాలంటే ఎవడు కొనివ్వాలి

'24 గంటల కరెంట్ బంద్ చేస్తాం.. 3 గంటల కరెంట్ ఇస్తాం. కాబట్టి 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకోవాలని రేవంత్ రెడ్డి అంటుండు. రైతుల వద్ద 10 హెచ్‌పీ మోటార్ ఉంటదా..? 3 హెచ్‌పీ, లేదంటే 5 హెచ్‌పీ పెట్టుకుంటాం. నీళ్లు బాగా ఉంటే 5 హెచ్‌పీ పెట్టుకుంటాం. ఒకటి కాదు రెండు కాదు 30 లక్షల పంపు సెట్లు ఉన్నాయి తెలంగాణలో. 30 లక్షల 10 హెచ్‌పీ మోటార్లు కొనాలంటే ఎవడు కొనివ్వాలి. అందుకు రూ. 30 వేల కోట్లు కావాలి. అంత



బోధన్‌లో అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

డబ్బు ఎవడు ఇవ్వాలి. అందుకే బంగాళాఖాతంలో ఎవరిని వేయాలో రైతులు, ఓటర్లు ఆలోచన చేయాలని' చెప్పారు.

దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియలో పరిణతి రాలేదని, ప్రజాస్వామ్య పరిణితి సాధించిన దేశాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. గతంలో మోసపోయిన తెలంగాణ ప్రజలు ఇప్పుడు మోసపోవద్దని అభ్యర్థుల గురించి వారి పార్టీల గురించి ఆలోచించి మంచి ఏదో, చెడు ఏదో తెలుసుకొని ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల హక్కుల కోసం, నీళ్ల కోసం ఏర్పడిందన్నారు.

బోధన్ సభలో ఎమ్మెల్సీ కవిత, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, జడ్పి వైస్ చైర్మన్ రజిత యాదవ్ ,ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, నాయకులు నర్సింగ్ రావు, ఏఎంసీ చైర్మన్ విఆర్ దేశాయి, గిర్దావర్ గంగారెడ్డి, బుద్దె రాజేశ్వర్, బోధన్ ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా, ఎంపీపీ బుద్ధి సావిత్రి, శ్రీనివాస్

ఎల్లాఎడ్డిలో జడ్పీ చైర్మన్ శోభ రాజు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బిబి పటేల్ మాజీ స్పీకర్ మధుసూదనా చారి మాజీ ఎమ్మెల్యే జనార్ధన్ గౌడ్ మాజీ మంత్రి నేరాల ఆంజనేయులు ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో స్థిరపడాలి


పూలబొకేను అందిస్తూ ఆహ్వానిస్తున్న సంస్థ డైరెక్టర్

- డైరెక్టర్ పి.విశ్వనాథ్ రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిరుద్యోగులకు అశాకిరణం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఏర్పడిందని, ఇక్కడ శిక్షణ పొందిన అనేక మంది తమ జీవితంలో స్థిరపడి కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తున్నారని ఎపి, టిఎస్ రాష్ట్ర డైరెక్టర్ పి.విశ్వనాథ్ రెడ్డి అన్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఘన్‌పూర్ శివారులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఎస్బిఐ అర్ఎస్ఈటిఐ ను సందర్శించారు. ఎలక్ట్రిషియన్, సిసి టివి శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అంతకుముందు రిజిస్టర్లను తనిఖీ చేసి జరుగుతున్న శిక్షణ, వసతులను పరిశీలించి ఎలక్ట్రీషియన్ బ్యాచ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఎలక్ట్రిషియన్, సిసి టివి లకు మార్కెట్లో డిమాండ్ ఉందన్నారు. ఇలాంటి శిక్షణను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, రామ కృష్ణ, రంజిత్, నవీన్, రవి, రఘుదీప్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం బుధవారం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీపీ గద్దె భూమన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో గత సమావేశంలో తీర్మానించిన పనుల పురోగతిని ఆయా శాఖల అధికారులు పాల్గొని వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో నూతన పనుల విషయంపై చర్చ చేపట్టకుండా సమావేశం లో మండలంలో అత్యవసరంగా ఉన్న వాటిని పూర్తి చేయాలని సర్పంచులు సభదృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఎంపిడిఓ టీవీఎస్ గోపి బాబు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఆలూరులో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా



నవతెలంగాణ-ఆర్మూర్

జీవనన్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో భాగంగా దరఖాస్తు చేసుకున్న ఆలూర్ గ్రామ యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ గడ్డం సంతోష్ రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జీవన్ రెడ్డి యువత ఎదుర్కొంటున్న లైసెన్స్ సమస్యను పరిష్కరించడం కోసం ఆలోచించి స్వంత డబ్బులు వెచ్చించి లైసెన్స్‌లు ఇప్పించడం గొప్ప విషయమని అన్నారు. అటువంటి జీవన్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీ ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్, వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి, ఎంపీటీసీ మల్లేష్, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, గ్రామ అధ్యక్షులు రజనీకాంత్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నల్మెల మోహన్, వార్డు సభ్యులు గంగారెడ్డి, మహేష్, సత్యం, నల్లన్న, యూత్ నాయకులు, యువకులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తమ్ముడిపై అన్న కత్తెరతో దాడి

- మూడో పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సొంత తమ్ముడిపై అన్న కత్తెరతో దాడికి పాల్పడ్డ ఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ వివరాల ప్రకారం.. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 3వ పోలీస్ స్టేషన్ పరిధిలో నాందేవాడకు చెందిన మద్యానికి బానిసైన హనుమంతు అనే వ్యక్తి తన సొంత తమ్ముడు అయిన భీమ్ రావ్ ఇంటికి వచ్చాడు. అక్కడ అన్నదమ్ముల మధ్య డబ్బుల కోసం మాటమాట పెరగడంతో అన్న హనుమంతు కోపంతో తమ్ముడు భీమ్ రావ్‌ని కత్తెరతో పొడిచాడు. అనంతరం చుట్టుపక్కల వారు చేరడంతో అన్న హనుమంతు అదే కత్తెరతో తనకు తాను పొడుచుకున్నట్లు సమాచారం. స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇరువురు అన్నదమ్ములు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫిర్యాదు ఇచ్చిన అనంతరం మిగతా వివరాలను వెల్లడిస్తామని మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రవీణ్ తెలియజేశారు.

నామినేషన్ ఉపసంహరించుకున్న

సర్పంచుల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షులు


నామినేషన్ ఉపసంహరించుకున్న రాజేందర్

నవతెలంగాణ-ఆర్మూర్

పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, జిల్లా మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి సూచనల ప్రకారం నియోజక వర్గం నుండి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు గోర్త రాజేంధర్ తన నామినేషన్ ఉపసంహరించుకుని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వినయ్ కుమార్‌కు పూర్తి మద్దతును ప్రకటిస్తున్నట్టు బుధవారం తెలిపారు. తన అభిమానులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించేలా కృషి చేయాలన్నారు. అందరూ కలిసి ఆర్మూర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాని ఎగరవేయాలని తెలిపారు. తనకు కాంగ్రెస్ పార్టీ నాయకుల నుండి భరోసా లభించిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పకుండా పూర్తి న్యాయం చేసి మంచి హోదా కల్పిస్తామని తెలిపారని అన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వినోద్ కుమార్ నుండి నామినేషన్ ఉపసంహరణ పత్రాన్ని తీసుకున్నారు.

మహిళ మెడ నుంచి బంగారు గొలుసు అపహరణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అరుంధతి నగర్ వెళ్లే దారిలో గల మల్లారెడ్డి చెరువు కట్టపై బుధవారం చైన్ స్నాచింగ్ జరిగింది. మెట్‌పల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన ఎల్లవ్వ అనే మహిళ తన భర్తతో కలిసి టీవీఎస్ మోపెడ్‌పై వెళుతున్నారు. పల్సర్ బైక్పై వెనుకనుండి వచ్చిన దుండగులు ఆమె మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును అపహరించుకు వెళ్లారు. దీంతో ఆమె చెరువు కట్టపై లబోదిబో అంటూ కేకలు వేసింది. తరచుగా ఈ చెరువు కట్టపైనే చైన్ స్నాచింగ్లు జరుగుతున్నాయని స్థానిక పోలీసులు నిఘాపెట్టి పట్టుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కాగా బాధిత మహిళ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

మానవత్వం చాటుకున్న మోపాల్ యువత

నవతెలంగాణ - మోపాల్


దుప్పటి అందజేస్తున్న యువకుడు

మండల కేంద్రానికి చెందిన పెద్దోళ్ల అశ్విత, వినోద్ రెడ్డి మానవత్వం తో చలికాలం దృష్ట్యా వృద్దులకు, అనాధలకు, నిరుపేదలకు సుమారు 170 మందికి దుప్పట్లను పంపిణి చేశారు. వారు మాట్లాడుతూ మనకు న్నదాంట్లో కొంత సహాయం చేసి ఇలాంటి సమయంలో పేదవారికి అండగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగలి నవీన్ రెడ్డి, ద్యాప రవి కుమార్, సాగర్, వంశీ రెడ్డి, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ తన్వీర్‌కు డాక్టరేట్ ప్రధానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ డిపార్ట్‌మెంట్‌లో మహమ్మద్ తన్వీర్ కు తెలంగాణ యూనివర్సిటీ బుధవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, పాఠ్య ప్రణాళికల అధ్యక్షులు డాక్టర్ ముహమ్మద్ అబ్దుల్ ఖవి పర్యవేక్షణలో ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియాలో సాంకేతిక పరిజ్ఞానం అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని తెలంగాణ యూనివర్సిటీ కి సమర్పించారు. ఈ బహిరంగ వైవా కు ఎక్స్టర్నల్ గా ఎగ్జామినర్‌గా ప్రొఫెసర్ మోయిద్ జావిద్ పూర్వ విభాగాధిపతి ఉర్దూ విభాగం ఉస్మానియా యూనివర్సిటీ హాజరయ్యారు. పరిశోధక విద్యార్థి తన్వీర్ ప్రింట్ మీడియా మరియు సాంకేతిక పరిజ్ఞానం, ముద్రణా రంగంలో, రేడియో రంగంలో ఇంటర్నెట్ రంగంలో సామాజిక మాధ్యమంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒక జర్నలిస్టు ఏ విధంగా సాధించాలని అంశంపై కూలంకషంగా తన సిద్ధాంత గ్రంథంలో విశదీకరించారు. ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ అడిగిన వివిధ ప్రశ్నలకు పరిశోధకుడైన మహమ్మద్ తన్వీర్ సంతృప్తికరమైన సమాధానాలు అందించారు. పరిశోధకులు మొహమ్మద్ తన్వీర్‌ను ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ వి. త్రివేణి జర్నలిజంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ విధంగా అనువర్తింప చేయాలో సవివరంగా చర్చించారు. టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి పరిశోధక విద్యార్థిని, పర్యవేక్షకుడిని అభినందించారు.

భారత్ జాగృతి గ్రామ కన్వీనర్ల నియామకం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాదు రురల్ నియోజకవర్గ కన్వీ నర్ మల్లెల సాయి చరణ్ , జక్రాన్ పల్లి మండల కన్వీనర్ శ్రీకాంత్, మండల యూత్ కన్వీనర్ ఆకాష్ ఆధ్వర్యంలో బుధవారం భారత జాగృతి గ్రామ కన్వీనర్లను, ఉప కన్వి నర్ లను నియమించారు. నూతన బాధ్యులు సంస్థ ఆశయాలకు కట్టుబడి శక్తివంచన లేకుం డా కృషి చేయాలని మల్లెల సాయి చరణ్ సూచించారు. కార్యక్రమంలో జాగృతి నా యకులు రాహుల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుద్దపల్లి గురుకుల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

- పిడిఎస్‌యూ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న పిడిఎస్‌యూ నాయకులు

కుళ్ళిన కూరగాయలు వండుతున్న పట్టించుకోని సుద్దపల్లి గురుకుల ప్రిన్సిపల్ పై అధికారులు చర్యలు తీసుకోవాలని పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం డిచ్ పల్లి మండలంలోని ధర్మారం (బి)లో ఉన్న రీజినల్ కో ఆర్డినేటర్ అలివేలుకు పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిచ్ పల్లి మండలం లోని సుద్దపల్లి బాలికల గురుకులంలో విద్యార్థులకు అందజేసే భోజనంలో నాణ్యత లోపం జరుతుందని, మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, కుళ్ళిన కూరగాయలను వండుతున్నారని, డ్యూటీ రోస్టర్‌ను పాటించడం లేదని అన్నారు. సమస్యలు బయటకు పొక్కకుండా విద్యార్థి సంఘాలను లోపలికి రానివ్వడం లేదని , వెంటనే ఉన్నతాధికారులు కళాశాల ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని, ఆర్ సి ఓ ప్రతిరోజు గురుకులాలను అకస్మాత్తుగా సందర్శించి పర్యవేక్షించాలని అన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివ సాయి, రవీందర్, అక్షయ్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

నవతెలంగాణ-ముప్కాల్

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సమక్షంలో బుధవారం వేంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు నరేశ్, గంగాధర్, సురేష్, రాజ్ కుమార్ తదతరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వేంపల్లి సొసైటీ ఛైర్మన్ జక్క రాజేశ్వర్ ఆధ్వర్యంలో బీజేపీ యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఈసారి బాజిరెడ్డి గెలుపు తథ్యం

- ఐడిసిఎంఎస్ ఛైర్మన్ సాంబార్ మోహన్
- ఇంటింటా విస్తృతంగా ప్రచారం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అబిమానులతో కలిసి ఇందల్ వాయి మండలం లోని నల్లవెల్లి గ్రామంలో ఐడిసిఎంఎస్ ఛైర్మన్ సాంబార్ మోహన్ అధ్వర్యంలో

బుధవారం గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఈసారి నూతనంగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రవేశ పెట్టే పథకాలను ప్రజలకు, మహిళలకు వివరించారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గత పదేళ్లుగా రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నారని తెలిపారు. కారు గుర్తుకే ఓటు వేసి రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలి పించాలని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ లక్ష్మి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఐడిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన యువకులు బుధవారం ఉపసర్పంచ్ కప్పదండి అశోక్ ఆధ్వర్యంలో ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన మహేష్, హరీష్, మల్లేష్, మారుతి, హరీష్, తదితరులు కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, నియోజకవర్గంలో ముత్యాల సునీల్ కుమార్ గెలుపు తథ్యమన్నారు. ఆ గెలుపులో తాము కూడా భాగస్వామ్యం కావాలని, ముత్యాల సునీల్ కుమార్ గెలుపు కొరకు పని చేయాలని నిర్ణయించుకొని కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు వారు తెలిపారు. అనంతరం ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేయబోయే ఆరు గ్యారెంటీలను ప్రజలలోకి తీసుకెళ్లి అవగాహన కల్పించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసేలా చేయాలని వారిని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు

కాంగ్రెస్‌లో చేరిన మహిళలు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని సుంకేట్ గ్రామానికి చెందిన పటేల్ యూత్ మహిళ సభ్యులు కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సమక్షంలో బుధవారం చేరారు. పటేల్స్ యూత్ కు చెందిన 20 మంది మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. బాల్కొండ నియోజకవర్గం లో కాంగ్రెటస్ అభ్యర్థి సునీల్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిక

నవతెలంగా -ముప్కాల్

మండలంలోని రెంజర్ల గ్రామానికి చెంది న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు క్యాతం గంగారెడ్డి బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గులాబీ కండువా కప్పి వేముల ప్రశాంత్ రెడ్డి క్యాతం గంగారెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. ంసీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో అవలంభిస్తున్న సంక్షేమ పథకాలను చూసి పార్టీలోకి రావడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ బీఆర్ఎస్ పార్టీ మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు

ధర్మారం (బి) విద్యార్థినులు ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్కూల్ గేమ్స్ అండర్ 19 హ్యాండ్ బాల్ పోటీలకు డిచ్ పల్లి మండలం లోని ధర్మారం (బి) గురుకుల పాఠశాల కళాశాల కు చెందిన విద్యార్థినులు ఎంపికైనట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గంగాధర్ బుధవారం తెలిపారు. మూడు రోజుల క్రితం మహబూబ్ నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచి హర్యానాలో నిర్వహించే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో డి.నవనీత, బి. వర్ష విద్యార్థిలను డిఐఈఓ రఘు రాజు, తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల నవీపేట్ ప్రిన్సిపల్ రాగలత , నిజామాబాద్ జిల్లా సోషల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నీరజా రెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మల్లేష్ గౌడ్, పిడి ఉదయ్ శీల, పిఈటీలు విద్యార్థిలను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

పెద్దమొత్తంలో మద్యం దిగుమతులపై దృష్టి సారించాలి

- ఐఎంఎల్ గోడౌన్‌ను పరిశీలించిన అబ్జర్వర్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మాదాపూర్‌లో గల ఐఎంఎల్ (మద్యం నిల్వల) గోడౌన్ ను ఆర్మూర్, బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు శక్తి బుధవారం పరిశీలించారు. ఎన్నికల షెడ్యూలు వెలువడిన నాటి నుండి ఇప్పటివరకు బాల్కొండ, ఆర్మూర్ సెగ్మెంట్లకు ఎంత పరిమాణంలో మద్యం నిల్వలు అమ్మకం జరిగాయి. ఏ ప్రాంతాలలో ఎక్కువ దిగుమతి చేసుకున్నారు. ఎన్నికల ప్రకటన వెలువడడానికి ముందు మద్యం అమ్మకాలు ఏ స్థాయిలో ఉన్నాయి. తదితర వివరాలను ఎక్సైజ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మద్యం నిల్వల కేటాయింపులు, అమ్మకాల వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు. పోలింగ్ సమయం సమీపించిన దరిమిలా ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు మద్యం పంపిణీ జరిగే అవకాశాలు ఉన్నందున గట్టి నిఘా కొనసాగించాలని అబ్జర్వర్ శక్తి సూచించారు. ముఖ్యంగా సాధారణ సమయాలకంటే ప్రస్తుతం పెద్ద మొత్తంలో మద్యం దిగుమతులు జరిగిన ప్రదేశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని నిఘా బృందాలతో పాటు సంబంధిత అధికారులకు హితవు పలికారు. అబ్జర్వర్ వెంట జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య, ఎక్సయిజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, సూపరింటెండెంట్ మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.



ఐఎంఎల్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న అబ్జర్వర్

వరద కాలువలో

వలకు చిక్కుకున్న కొండచిలువ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ రోడ్ లో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద కాలువలో మత్సకారుల వలకు కొండచిలువ చిక్కుకుంది. మంగళవారం సాయంత్రం వరద కాలువలో చేపలు పట్టేందుకు కోసం స్థానిక మత్స్యకారులు కంట్రిలు వేశారు. బుధవారం ఉదయం వలలో చిక్కుకున్న చేపలను తీసేందుకు జాలర్లు కండ్రిలను బయటకు తీయగా అందులో కొండచిలువ ఉండడానికి గమనించారు. వెంటనే కండ్రీలను బయటకు తీసి అందులో చిక్కుకున్న కొండ చిలువను బయటకు తీసి గ్రామంలోకి తీసుకువచ్చారు. పది అడుగులకు పైగా పొడవున్న కొండ చిలువను మత్స్యకారులు గ్రామంలోకి తీసుకురాగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కాగా గతంలో ఇదే వరద కాలువలో చేపల వలకు కొండచిలువ చిక్కుకుంది. రెండు రోజుల క్రితం హాస కొత్తూర్ పాత చెరువులో మత్స్యకారులు చేపల కోసం వేసిన కండ్రిలకు కొండచిలువ చిక్కుకున్న విషయం తెలిసిందే. చెరువుల్లో, వరద కాలువలో తరచూ వలలకు కొండ చిలువలు చిక్కుకోవడం పట్ల మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బీడీ కార్మికుల సమస్యలను మ్యానిఫెస్టోలో చేర్చాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అసెంబ్లీ ఎన్నికల్లో బీడీ కార్మికుల సమస్యలను ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని, కోట్పా చట్టాన్ని అమలు చెయ్యొద్దు అని, బీడీ పరిశ్రమపై జీ ఎంటి ని రద్దు చెయ్యాలని, బీడీ కార్మికులకు ఆంక్షలు లేని జీవనభృతి 4000 రూపాయలు ఇవ్వాలని, కనీస వేతనాల జీవోను అమలు చెయ్యాలని, తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్క యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్క యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూమన్న, జిల్లా అధ్యక్షులు బి.సూర్య శివాజీ, నిజామాబాద్ ద్వారాక నగర్‌లోని ఐఎఫ్టీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలో రెండు లక్షలు తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులు, బీడీ పరిశ్రమలను నమ్ముకొని బతుకుతున్నారని అన్నారు. బీడీ పరిశ్రమను రక్షించవలసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ అవకాశాలు చూపెట్టకుండా, ప్రజల ఆరోగ్యాల దెబ్బ తింటున్నాయనే సాకుతో బీడీ పరిశ్రమను పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా కోట్పా చట్టాన్ని అమలు చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. కోట్ప చట్టం అమలు అయితే లక్షలాది మంది బీడి కార్మికుల జీవితాలు ఆగమ్య గోచరంగా మారే ప్రమాదం ఉందని ఆరోపించారు. అంతేకాకుండా బీడీ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం విధించిన జిఎస్టి వల్ల ఇప్పటికే బీడీ పరిశ్రమ పూర్తిగా నడవక సగం పని సగం రోజులు దొరకక కార్మికులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని వారు అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు వచ్చినందున రాజకీయ పార్టీల నాయకులు బీడీ పరిశ్రమను కాపాడుతామని, కోప్టా చట్టాన్ని అమలు చెయ్యమని, జీఎస్టీని ఎత్తివేస్తామని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతన జీ ను అమలు చేస్తామని బీడీ పరిశ్రమలో పని సరిగా లేనందున, బీడి కార్మికులకు కనీసం 4000 రూపాయల జీవన భృతి అమలు చేస్తామని, తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చి, గెలిచినా తరువాత అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 21న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సదస్సుకు బీడీ కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ ఎన్నికల్లో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చెయ్యకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి వస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్, జిల్లా ఉపాధక్షులు ఎం శివ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.సుప్రియ, డి పోశెట్టి, జిల్లా నాయకులు ఎల్ లక్ష్మి, ఎ. ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడతున్న అధ్యక్షులు

హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించండి

● ఆర్మూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వినయ్‌కుమార్‌రెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-డొంకేశ్వర్

హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని దత్తాపూర్ గ్రామంలో బుధవారం విజయ భేరి యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వినయ్ కుమార్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రెండు లక్షల ఉద్యోగులు ఇస్తామని చెప్పారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఉచిత కరెంట్ 200 యూనిట్ల వరకు, ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్ 4000 రూపాయలు ఇస్తామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితం, 500 కే వంట గ్యాస్, రైతు భరోసా 15వేల రూపాయలు, కౌలు రైతులకు 12వేలు ఇస్తామని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేను నమ్మకండి కుల సంఘాలను ప్రతి ఒక్కరిని మోసం చేశాడని, కమిటీ హాల్ కట్టిస్తానని చెప్పి అబద్ధపు ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చాడని తెలిపారు. ఈ అబద్ధాలు ఎమ్మెల్యేలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కబ్జాలు, కమిషన్లు తీసుకుంటూ వేల ఎకరాలను సంపాదించుకున్నాడని, వేయి కోట్ల రూపాయల సంపాదించాడని ఆరోపించారు. పేద ప్రజలను పట్టించుకోలేదని, ఎవరైనా ఎదురుతిరిగితే వారిపై కేసులు పెట్టించి, నానా రకాలుగా ఇబ్బంది పెట్టారని అన్నారు. అందరు ఒకసారి ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి, హస్తం గుర్తుకు ఓటేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మహిళలు భారీగా తరలివచ్చి మంగళహారతితో స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఆరు పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తాం

● ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్ నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి షబ్బీర్ అలీ



పార్టీలో చేరిన యువకులకు పార్టీ కండువాలు వేసిన షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ మున్నూరు కాపు కళ్యాణమండపంలో పద్మశాలి సంఘం సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో చేనేత ప్రభుత్వం అధికారంలోకి రాబోతుం దన్నారు కేంద్రంలో, రాష్ట్రంలో మోదీ, కేసీఆర్ ప్రభుత్వాలు చేనేతలకు ఉరితాళ్లు మిగుల్చుతున్నాయని తెలిపారు. ఏమైనా సలహాలు, సూచనలు ఉంటే చెప్పండి.. అవి కూడా చేస్తామని అన్నారు. రాబోయేది మీ ప్రభుత్వం.. మీరు ఎన్నుకోబోతున్న ప్రభుత్వం. మీరు మనస్ఫూర్తిగా నాకు మద్దతు ఇస్తేనే పదవులు..వస్తాయని తెలిపారు. అందుకే నేతన్నకు చేయూతలో ముందు వరుసలో ఉంటానని అన్నారు. ఎవరైనా నేత కార్మికుడు దురదృష్టవశాత్తు చనిపోతే వారం రోజుల్లో వారి కుటుంబాలకు ఆదుకునే పథకాలు తీసుకువస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పద్మశాలీలకు ఐదు సీట్లు కేటాయిస్తామని మోసం చేసిందని, ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ పద్మశాలీలకు సముచిత స్థానం కల్పించిందని, రాబోయే రోజుల్లో సమస్యలను చూస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతీ నెలా మహిళలకు రూ. 2500 అందిస్తామని చెప్పారు. అంతేకాకుండా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. గృహ జ్యోతి ద్వారా ప్రతీ ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పారు. తెలంగాణలో దొరలపాలనను సాగనంపి. ప్రజా తెలంగాణను ఏర్పాటు చేసుకుందామని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని వెల్లడించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కేశ వేణు, నరాల రత్నాకర్, నిజాంబాద్ నగరంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

300 మంది కాంగ్రెస్‌లోకి

ఆకుల లలిత, కేశవేను, పంచరెడ్డి చరణ్ ఆధ్వర్యంలో సంతోష్ బిజెపి నుండి సతీష్ ఆధ్వర్యంలో 300మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని మహమ్మద్ అలీ షబ్బీర్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. మన రాష్ట్రం సాధించుకుంటే జీవితాలు బాగుపడతాయని యువకులు ఉద్యమంలో ముందు వరసలో ఉండి తమ చదువు ఉద్యోగాలు భవిష్యత్తు పణంగా పెట్టి తెలంగాణ సాధించుకుంటే కేసీఆర్ కుటుంబమే దాని ప్రతిఫలం అనుభవిస్తుం దన్నారు. ఉద్యోగాలు లేవు ఫీజు రీయింబర్స్ మెంట్ లేదు. స్కాలర్‌షిప్స్ లేవు.. ఏ పరీక్షలు జరిగినా పేపర్ లీక్ అవ్వడం కష్టపడి చదివిన వాళ్ళ శ్రమ వృధా అవుతుంది. అందరూ కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చి గెలిపించండి



ప్రచారం చేస్తున్న అన్యోన్య

నవతెలంగాణ-ఆర్మూర్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేస్తామని, కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చి గెలిపించాలని కాంగ్రెస్ నియోజకవర్గ అభ్యర్థి పొద్దుటూరి వినయ్ రెడ్డి భార్య అన్యోన్య రెడ్డి అన్నారు. పట్టణంలో గడపగడపకు ప్రచారంలో భాగంగా పలు వార్డులలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు, నెలకు 2500 ఆర్థిక సహాయం అందజేస్తామని అన్నారు. ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పిస్తామని, ఈసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు వంద శాతం పరిష్కారిస్తా

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు.. స్వాగతించిన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూపతి రెడ్డి



పార్టీలో చేరిన మాజీ ఎంపీటీసీ చింతల కిషన్‌కు పార్టీ కండువా వేస్తున్న భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామంలో చాలా సమస్యలు ఉన్నాయని, గెలిచిన వెంటనే వందశాతం ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కారిస్తానని, అందరూ కలిసి కట్టుగా గెలుపే ధ్యేయంగా పనిచేయాలని నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి అన్నారు. ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో మంగళవారం రాత్రి తిర్మన్ పల్లి మాజీ ఎంపీటీసీ చింతల కిషన్, బీ ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్, బోర్ వెల్ రాజేందర్ రెడ్డీ, అహ్మద్ హుస్సేన్‌తో పాటు యువకులు, వివిధ సంఘాలకు చెందిన బిజెపి, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన దాదాపు 200మంది కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గ్రామ శివారు నుండి డప్పు వాయిద్యాలతో వందలాది మంది ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించి డాక్టర్ భూపతి రెడ్డికి, ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రకటించిన అరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఉన్న సమస్యలను వంద శాతం అమలు చేస్తామని పేర్కొన్నారు. డాక్టర్ భూపతి రెడ్డి గెలుపు కోసం తామంత కష్టించి పనిచేసి గెలుపే ధ్యేయంగా ముందుకు వెళ్తామని ప్రకటించారు. గతంలో ఎమ్మెల్యే, ఎంపి, అధికారులకు వినతి పత్రాలు అందజేసిన సమస్య పరిష్కారానికి నోచుకోలేదని అన్నారు. అంతకు ముందు మహిళలు మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, జంగిల్ లక్ష్మీ, ఉప సర్పంచ్ భైరయ్య, డిసిసిబి డైరెక్టర్ కోరట్ పల్లి అనంద్, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి, శేఖర్ గౌడ్‌తో పాటు వందలాది మంది యువకులు, మహిళలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

● గులాబీ కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన మంత్రి

● కొనసాగుతున్న ఏకగ్రీవ తీర్మానాలు



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు, యువకులు, ఇతర పార్టీ కార్యకర్తలు బుధవారం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామం నుండి టీపీసీసీ డెలిగేట్, మాజీ సొసైటీ చైర్మన్ క్యాతం గంగారెడ్డి, మాజీ నీటి సంఘం చైర్మన్ గడ్డం ముత్యం రెడ్డి, సీనియర్ నాయకులు ఎర్రోళ్ల చిన్నారెడ్డి, రిక్కల రవి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వెంచిర్యాల్ గ్రామం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎన్ఎస్‌యుఐ ప్రెసిడెంట్ పాశపు నర్సారెడ్డి, వార్డు సభ్యుడు సామ శ్రీనివాస్, కార్యకర్తలు బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. మెండోరా మండలం సోన్‌పేట్ గ్రామానికి చెందిన క్రేజీ బాయ్స్, ఫ్రీడమ్, యూనిటీ యూత్ యువజన సంఘాల సభ్యులు, ఆదివాసీ నాయకపోడు సంఘ సభ్యులు, వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజారపు మురళి, కార్యకర్తలు పార్టీలో చేరారు. మోర్తాడ్ మండలం గాండ్లపేట్ గ్రామానికి చెందిన నూతనంగా ఓటు హక్కు పొందిన యువకులు మంత్రి ప్రశాంత్ రెడ్డికి మద్దతు తెలుపుతూ పార్టీలో చేరారు. ముప్కాల్ మండలం వెంపల్లి గ్రామానికి చెందిన వొళ్ళెం గుల మల్లేష్, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ నుండి తిరిగి సొంత గూటికి చేరారు. గ్రామానికి చెందిన విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు పార్టీలో చేరారు. వీరందరికీ గులాబీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు.

మంత్రి వేములకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు

వేంపల్లి గ్రామానికి చెందిన విశ్వ బ్రాహ్మణ సంఘం, మోర్తాడ్ మండలం షెట్పల్లి గ్రామానికి చెందిన యశోదా కృష్ణ గొర్రెల పెంపకం దారుల సంఘం ఏకగ్రీవ తీర్మానం చేశారు. అభివృద్ధి ప్రదాత వేముల ప్రశాంత్ రెడ్డికే మా ఓటు అంటూ ముక్త కంఠంతో నినదించారు. అందుకు సంబంధించిన తీర్మాన పత్రాలు మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

నవతెలంగాణ-మాచారెడ్డి

పాల్వంచ మండలంలోని భవానిపేట గ్రామంలో బుధవారం ఉప సర్పంచ్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో గురించి అవగాహన కల్పిస్తూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడపల్లిలో జోరుగా కాంగ్రెస్ ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులు కార్యకర్తలు బుధవారం గడపగడపకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండలంలోని మంగల్‌పాడ్, కుర్నాపల్లి, జానకంపేట ఆయా గ్రామాలలో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ చేకూరి గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అటు కేంద్రంలో రాష్ట్రంలో గెలుపొందడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బడుగు బలహీన పేద నిరుపేద అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం చేస్తూ సంక్షేమ ఫలాలను అందజేసినట్లు ఆయన గుర్తు చేశారు. బోధన్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుంట శ్రీనివాస్, తాటి సంతోష్ గౌడ్, చేపూర్ కర్ణాకర్ గౌడ్, బండ లింగారెడ్డి, ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన డీసీసీబీ మాజీ డైరెక్టర్

నవతెలంగాణ-సదాశివనగర్



కాంగ్రెస్‌లో చేరిన మాజీ డైరెక్టర్ శంకర్

మండలంలోని ధర్మరావ్‌పేట్ గ్రామానికి చెందిన డిసిసిబి మాజీ డైరెక్టర్, తెలంగాణ మత్స్య కారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, గంగపుత్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల శంకర్ ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలు పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. నామాల శంకర్‌తో పాటు ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలో గల మత్స్య సహకార సంఘం ప్రతినిధులు, గంగపుత్ర సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీలో మదన్‌మెహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌తోనే పేద ప్రజలకు న్యాయం

- బాన్సువాడ కాంగ్రెస్ అభ్యర్థి రవీందర్‌రెడ్డి సతీమణి మంజుల

నవతెలంగాణ-నసురుల్లాబాద్



ప్రచారంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి సతీమణి మంజుల

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏనుగు రవీందర్ రెడ్డి సతీమణి మంజుల అన్నారు. బుధవారం నసురుల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి, నెమ్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ బాన్సువాడ పట్టణంలో సొంత ఇల్లు కట్టుకుని ఇక్కడే ఉండి ఇక్కడి ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, బాన్సువాడలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన సాగిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ జైత్రయాత్ర మొదలైందని తెలిపారు. బాన్సువాడలో కాంగ్రెస్ నాయకులకు ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారన్నారని, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలతో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. పెన్షన్ రాక ఎంతో మంది వయోవృద్ధులు, వితంతువులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కష్టాలన్నీ తొలిగిపోవాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఏనుగు రవీందర్ రెడ్డి చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నందు పటేల్, సర్పంచులు హరిగే సాయిలు, సత్యనారాయణ, ప్రతాప్ సింగ్, భాస్కర్‌రెడ్డి, తూము సాయగౌడ్, శివప్రసాద్, యూసుఫ్, గంగారెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుని కష్టం ఉత్తదేనా..?

నవతెలంగాణ-రామారెడ్డి



ఉమ్మడి రాష్ట్రంలో నీళ్ల, నిధులు, నియామకాలలో అన్యాయం జరుగుతుందని తెలంగాణ రాష్ట్రమే లక్ష్యంగా, లక్షలాదిమంది తెలంగాణ రాష్ట్రం సాకారం అయ్యేవరకు పోరాటం చేశారు. కానీ ఉద్యమకారులకు కష్టం వస్తే ఉత్తదేనా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి లక్ష్మా గౌడ్ 2021 నుంచి తెలంగాణ ఉద్యమ కోసం పోరాడిన ఉద్యమకారుడు. రాష్ట్ర అవతరణ తర్వాత తనకు ఎదురైన చేదు అనుభవాలను నవతెలంగాణతో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లో.. '2021లో అలంపూర్ జోగులాంబ దేవాలయం నుండి కెసిఆర్‌తో పాదయాత్రతో పాటు, రైలు రోకోలో కేసులను ఎదుర్కొని, కోర్టులో చుట్టూ తిరిగి, తెలంగాణ కోసం పోలీస్ స్టేషన్లో గుండు గీయించుకొని, సొంత పైసలతో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నాలో పాల్గొన్నాం. గ్రామాల్లో ఉద్యమం కోసం ప్రజలను ఏకం చేసి, ఉద్యమ బాటలో ముందుండి పోరాటం చేశాం. రాష్ట్రం సాకరమైన తరువాత న్యాయం జరుగుతుందని ఆశించినా, ఉద్యమకారులు నమ్ముకున్న పార్టీ, చేసింది ఉత్తదే. చివరకు మిగిలింది గుండు సున్నే. తన సొంత కూతురు ప్రసవానికి, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు పట్టించుకోవడంలేదని, ప్రజా ప్రతినిధులను వేడుకున్నా పట్టించుకోలేదు. తొమ్మిదో వార్డులో నేను నివసిస్తున్నా. ఇంటి పరిసరాల్లో డ్రైనేజీ లేక వర్షానికి ఇంట్లోకి నీళ్లు వస్తుంటే, స్థానిక ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ సంబంధిత అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన స్పందన లేదు. సర్పంచ్‌గా పోటీ చేస్తే పార్టీ నుంచి సహకారం అందలేదు. కష్టపడి సొసైటీ డైరెక్టర్‌గా గెలుపొందితే, రైతుల ధాన్యం రైస్ మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని స్థానిక ఎమ్మెల్యే సురేందర్‌కు సమాచారం ఇద్దామంటే మూడు రోజులు ఫోనే లిఫ్ట్ చేయలేదు. ఒక ఉద్యమకారునిగా ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా నష్టపోయినా ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేక కుటుంబం రోడ్డున పడ్డది. నాలాంటి ఉద్యమకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.' అని లక్ష్మాగౌడ్ కోరారు.

జుక్కల్‌లో మద్యం పట్టివేత



మద్యం పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని జుక్కల్ పోలీస్‌స్టేషన్ ముందు పోలీస్ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా మద్యం పట్టుకున్నారు. జుక్కల్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మద్నూర్ మండలం అంతాపూర్ గ్రామానికి చెందిన డి.అజయ్ జుక్కల్ నుంచి 27 లీటర్ల విస్కీని తనిఖీలు చేపడుతుండగా పట్టుకున్నామని, దాని విలువ రూ.27వేలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

కామారెడ్డిలో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

- కేసీఆర్‌కు ఓటేయండి.. అభివృద్ధికి సహకరించండి
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్

నవతెలంగాణ-కామారెడ్డి



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం పార్టీ నాయకులతో కలిసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ సీఎం కేసీఆర్ తరపున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌కు ఓటు వేసి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు. దేశంలోనే ప్రత్యేక గుర్తింపును రాష్ట్రానికి తీసుకు వచ్చారని ముందుముందు మరిన్ని సంక్షేమ పథకాలతో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణను ప్రత్యేక అభివృద్ధిలో నిలబెడతారన్నారు. ప్రచారంలో ఆయనతోపాటు వెంకట్రావు, కొత్తంటి శ్రీనివాస్‌రెడ్డి, బోరెడ్డి శివారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సిద్ధాపూర్ సర్పంచ్



క్రాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ సక్రుసింగ్

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని సిద్ధాపూర్ తండాకు చెందిన అధికార పార్టీ సర్పంచ్ సక్రుసింగ్, మరో ఇతర ముఖ్య నాయకులు, 200 మంది గిరిజన కుటుంబాలు ఏకగ్రీవ తీర్మాణంతో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీ కాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించినట్టు మాజీ జెడ్పిటిసి మురళీధర్‌గౌడ్, అడ్వకేట్ రామ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల 6 గ్యారెంటీ పథకాలతో పాటు ఇతర హామీలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో పాటు గిరిజన తాండ వాసులు పాల్గొన్నారు.

గ్రామంలో చెత్తచెదారం ఉండొద్దు

నవతెలంగాణ-పిట్లం



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో

గ్రామంలో చెత్తచెదారం ఉండవద్దని ఎంపీఓ బ్రహ్మం సెక్రటరీ సునీతను ఆదేశించారు. బుధవారం మండలంలోని బండాపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలోని ఆయా వార్డులలో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. 2023-24 సంవత్సరానికి గల ఇంటి పన్నులు వసూలు చేయాలని, గతంలో పేరుకుపోయిన బకాయిలను సైతం వసూలు చేసి పంచాయతీ అభివృద్ధికి దోహదపడాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్నికల బూత్‌లలో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలు లేక రైతులకు ఇబ్బందులు

● ఎల్లారెడ్డి సభకు తరలింపు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులకు కూలీలు దొరక్కపోవడంతో పంట పొలాలలో పనులు నిర్వహించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో ముఖ్యమంత్రి ఆశీర్వాద సభ ఉండడంతో పార్టీల నాయకులు సభ కోసం రూ.300 చొప్పున ఒక్కొక్కరికి ఇవ్వడంతో వారందరూ బీఆర్ఎస్ ఆశీర్వాద సభకు ఏర్పాటు చేసిన వాహనాలలో తరలివెళ్లారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి భోజనం వసతితోపాటు మందు పానీయాలు ఏర్పాటు చేయడంతో వృద్ధులు మహిళలు పిల్లాపాపలు ఆశీర్వాద సభకు తరలివెళ్లినట్లు సమాచారం.

అభివృద్ధి సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని నసురుల్లాబాద్ మాజీ ఎంపీటీసీ ఫోరం కన్వీనర్ కంది మల్లేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బాన్సువాడ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి అభివృద్ధి సంక్షేమ పథకల వివరాలను వివరించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మైలారం సొసైటీ చైర్మన్ మండల పార్టీ అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో మరోసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని ఆయన అన్నారు. పోచారంను భారీ మెజార్టీతో గెలిపించవలసిన బాధ్యత కార్యకర్తలపై ఎంతైనా ఉందన్నారు. ప్రతి కార్యకర్త సైనికునిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, రాంబాబు, సాయిలు, నర్సింలుగౌడ్, మైషాగౌడ్, అజ్గర్ అలీ, గంగారం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కురుమ సంఘం పెద్దలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రానికి చెందిన కురుమ సంఘం కుల పెద్ద చిందం మల్లయ్య బుధవారం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు పట్ల లక్ష్మీరాజ్యం, సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని, పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో మహిళలు చేరిక

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనేపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలకు ఆకర్షితులై భారీ సంఖ్యలో మహిళలు, రైతులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మొబిన్ ఖాన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. అనంతరం ఈ గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. రైతన్నలకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పి.సుదర్శన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలుపొందించుకుందామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నాగభూషణంరెడ్డి, ధనుంజయ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు సురేందర్‌గౌడ్, మాజీ మండల అధ్యక్షులు జి.సాయిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు నీరడి సాయిలు, శ్రీనివాస్‌గౌడ్, దేవదాస్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండలంలో ఎన్నికల పరిశీలన అధికారి లలిత నారాయణ పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఎన్నికల్లో భాగంగా ఓటర్లకు వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఎస్.ఐ కృష్ణ కుమార్, ఎంపీడీఓ బశిరోద్దీన్, తదితరులున్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారి

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు బుధవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆదేశాల మేరకు స్థానిక నాయకులు కామారెడ్డిలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన కొడగండ్ల లత అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకొని రూ.25వేలు, అదే గ్రామానికి చెందిన బెస్త కీర్తన మతిస్థిమితంతో బాధపడుతూ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు గంప గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు బొమ్మిడి రామ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తోటరాజు, కోమటి శాల మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రభుత్వ విప్

ప్రజా ఆశీర్వాద సభకు తరలిన ప్రజలు

నవతెలంగాణ-రెంజల్/గాంధారి

మండలంలోని బాగేపల్లి, వీరన్నగుట్ట తాండ సర్పంచులు పాముల సాయిలు, జాదవ్ గణేష్ నాయకుల ఆధ్వర్యంలో ప్రజా ఆశీర్వాద సభకు అత్యధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా గౌడ్, ఉప సర్పంచ్ సుదర్శన్, తాండ ఉపసర్పంచ్ వీరేందర్, జాదవ్ రాజు, మహిళలు, యువత అత్యధిక సంఖ్యలో తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

ఎల్లారెడ్డిలో ప్రజా ఆశీర్వాద సభకు తరలిన ప్రజలు..

గాంధారి: మండలంలోని వివిధ గ్రామాలు, తండాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎల్లారెడ్డిలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. బహిరంగ సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ రావడంతో బీఆర్ఎస్ మండల నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని పెద్ద సంఖ్యలో ప్రజలను బహిరంగ సభకు తరలించారు.



రెంజల్ : ప్రజా ఆశీర్వాద సభకు తరలిన ప్రజలు

మెజారిటీ వచ్చే దిశగా కృషి చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట్ మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన బూత్ కమిటీ ఇన్చార్జిలు, మెంబర్లు, కార్యకర్తలతో దోమకొండ ఉమ్మడి మండల ఎన్నికల ఇన్చార్జ్ తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి బుధవారం ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, భారీ మెజారిటీ దిశగా పనిచేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పరిగె ప్రేమ్ కుమార్, ఐడిసిఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ పసులది బాలమణి, వైస్ ఎంపీపీ కప్పెర రవీందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ఇంచార్జ్

లక్ష్మాపూర్‌లో బీఆర్ఎస్ ప్రచారం

● సర్పంచ్ సత్యనారాయణ



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో సర్పంచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం చేపట్టారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. కారుగుర్తుకే ఓటు వేయాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించుకోవాలని ప్రజలను కోరారు.

బోర్గంలో కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో సిద్ధ సాయిలు, బొజ్జ భూమయ్య ఆధ్వర్యంలో బుధవారం విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బోధన్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పి.సుదర్శన్‌రెడ్డిని అత్యధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి

నవతెలంగాణ-దోమకొండ

కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించి మూడోసారి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంప శశాంక్ అన్నారు. మండల కేంద్రంతో పాటు అంచనూరు, చింతామనుపల్లి గ్రామాలలో బుధవారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంప శశాంక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను చూసి ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్‌రావు, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షులు శేఖర్, నాయకులు నాగరాజు, సహదేవ్, వినోద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈసాయిపేటలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-మాచారెడ్డి

పాల్వంచ మండలంలోని ఇసాయిపేట్ గ్రామంలో బుధవారం గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాలగౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజంబాబు, శేఖర్‌రాజు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ సర్పంచులు



మదన్‌మోహన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన సర్పంచ్‌లు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు, లొంకతండా సర్పంచ్ ప్రేమ్‌సింగ్, కాయితీ తండా సర్పంచ్ గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మోహన్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్ మోహన్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ.. త్వరలో మండలంలోని మరికొందరు సర్పంచులు కాంగ్రెస్‌లోకి చేరబోతున్నారని ఆయన అన్నారు.

ఆశీర్వాద సభకు తరలిన కార్యకర్తలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ప్రతి గ్రామం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు బుధవారం ఎల్లారెడ్డిలో కేసీఆర్ ఆశీర్వాద సభకు బయలు దేరారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో ఆశీర్వాద సభకు ప్రజలు రావడానికి సిద్ధంగా ఉన్నా వాహనాలు లేకపోవడంతో కార్యకర్తలు నిరాశకు గురయ్యారని తెలిపారు.

ఎన్నికల పోలింగ్ కేంద్రాలు పరిశీలన

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను బుధవారం ప్రత్యేక అధికారి అర్జర్ చిపాంగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, ఎంపీడీఓ రాణి, ఎంపిఓ సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారి అర్జర్ చిపాంగ్

కబ్జాదారుల నుంచి భూములను కాపాడినం

• ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

ధరణి పోర్టల్ తీసుకొచ్చి ఎల్లారెడ్డిలో కబ్జాదారుల నుంచి భూములను కాపాడామని ఎల్లారెడ్డి శాసనసభ్యులు సురేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం మొట్ట మొదట జెండా మోసింది నేనేనని నియోజ కవర్గంలో కెసిఆర్ ఎనిమిది మండలాల్లో తిరిగారన్నారు. నియోజకవర్గంలో స్థితిగతులు కేసీఆర్‌కు తెలుసునని అన్నారు. ఐదు సంవత్స రాలలో ఎల్లారెడ్డి అభివృద్ధి చేసి చూపించా మన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎల్లారెడ్డి అభివృద్ధి చెందలేదని తెలిపారు. 22 ప్యాకేజీ ద్వారా పోచారం ప్రాజెక్టు ఆయకట్టు ఏ జోన్, బి జోన్ సమస్యలను పరిష్కరించి 360 రోజులపాటు పోచారం ప్రాజెక్టును నిండు కుండలా ఉంచుతామన్నారు. ఎల్లారెడ్డిలో పోడు పట్టాల సమస్య ఉందని పరిష్క రించాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు వివరించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఎల్లారెడ్డికి అండగా ఉంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ చేస్తాం

• ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ రావు

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్ మోహన్ రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని మోతె, ఎల్లారం, ఎల్లమ్మతండా, ముస్తపూర్, కొయ్యగుం డుతండా, సూరయిపల్లి, సూరయిపల్లి తండా, కోమట్పల్లి, పోతాయిపల్లి గ్రామాలలో కాంగ్రెస్ అభ్యర్థి మదన్మోహన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగంపేట్ మండలంలో భూముల పట్టాల కోసం లింగంపేట్ రైతులు జైలుకెళ్లారని ఆయన అన్నారు. భూములు రెవి న్యూ రికార్డుల్లో నమోదు కాలేదని ధరణిలో లోపాలు ఉన్నాయని రైతాంగం నానా ఇబ్బం దులు పడుతున్నారని తెలిపారు. లింగంపేట్ మండలంలో పోడు భూముల పట్టాల్లేక రైతులు విలవిల్లా డుతున్నారన్నారు. ఐదు సంవత్స రాలలో ఎల్లారెడ్డి నియోజక వర్గంలో 2043 మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని అయినా ప్రభుత్వం పట్టించుకు న్న పాపాన పోలేదన్నారు. వ్యవసాయ రంగం బాగుంటే పంటలు పండితే రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుం టారని ఆయన ప్రశ్నించారు. బోధన్-బీదర్ నూతన రైలు మార్గం కోసం కృషి చేస్తానని భరోసానిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా మన్నారు. ఈ ప్రచారంలో లింగంపేట్ జెడ్పి టిసి ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి, పార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ ఖదీర్, మహమ్మద్ కాసిఫ్, నారాగౌడ్, ఎల్లమయ్య, సర్పంచ్ రామ్‌రెడ్డి, దురిశెట్టి అశోక్, రఫిక్, ఫతియోద్దీన్, డాక్టర్ రాజు, మంద ప్రసాద్, ఉప సర్పంచ్ కౌడ రవి, సర్పంచులు రాజశేఖర్‌రెడ్డి, ప్రకాష్, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న మదన్‌మోహన్‌రావు

పేద ప్రజల సంక్షేమం కోసమే బీఆర్ఎస్ పథకాలు

• ఎమ్మెల్యే హనుమంత్ షిండే

నవతెలంగాణ-బిచ్కుంద

తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం కోసమే ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి ఇంటికి అందే విధంగా కృషి చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే హనుమంత్ షిండే అన్నారు. బుధవారం బిచ్కుంద మండలంలోని శాంతాపూర్, రాజాపూర్, ఎల్లారం, సిత్రంపల్లి, మాన్యాపూర్, పెద్దదడ్గీ, చిన్నదడ్గి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలు కుతూ బతుకమ్మ ఆటలు ఆడుతూ నృత్యాలు చేసి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే హన్మంతు షిండే మాట్లాడుతూ.. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, కంటి పరీక్షలు, రైతుబీమా, రైతుబంధు, తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేసి 10 సంవత్సరాల్లో జుక్కల్ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, ప్రధాన రహదారులు ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు.

మాయమాటలు చెప్పే నాయకులను నమ్మవద్దని పొరుగు జిల్లా నుంచి వచ్చిన నాయకులు ఇక్కడ ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టి మోసం చేయడానికి వస్తున్నారని వారిని నమ్మరాదని అన్నారు. తాను ఈ ప్రాంత వాసిని ఇక్కడ ప్రజల కష్టసుఖాలు తెలిసిన వాడిని కాబట్టి బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. శాంతాపూర్ గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, ఏఎంసీ చైర్మన్ నాగనాథ్ పటేల్, ఎంపిటిసి చంద్రకళ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, గ్రామ అధ్యక్షు లు రాజాగౌడ్, నాయకులు, కార్యకర్తలున్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

ఎన్నికల సంబంధిత అంశాలపై

ఫిర్యాదులు చేయొచ్చు

• బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు లలిత్ సింగ్ నారాయణ్ సందు

నవతెలంగాణ-బోధన్

బోధన్, బాన్సువాడ శాసనసభ నియోజ కవర్గాల ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి అంశమైనా తనకు నేరుగా ఫిర్యాదు చేయ వచ్చని ఎన్నికల సాధారణ పరిశీలకులు లలిత్ నారాయణ్ సింగ్ సందు సూచించారు. పైరెండు సెగ్మెంట్లలో ఎన్నికలతో ముడిపడిన ఏ విషయమైనా తన దృష్టికి తీసుకురావచ్చని ప్రజలకు సూచించారు. సెలవు దినాలలో మినహాయించి మిగతా అన్ని దినాలలో అసెం బ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు తాను బోధన్ పట్టణంలోని ఇరిగేషన్ అతిథి గృహం లో అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు తనకు నేరుగా కలిసి బోధన్, బా న్సువాడ నియోజకవర్గాల ఎన్నికల సంబంధిత అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేయవచ్చని, సలహాలు, సూచనలు అందించ వచ్చని పరిశీలకులు సూచించారు. నేరుగా కలిసేందుకు వీలుపడని వారు సెల్: 8332021758కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

అభివృద్ధి కోసమే కేసీఆర్ పోటీ

• ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడి నుండి పోటీ చేస్తున్నారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసమే తాను ఎమ్మెల్యే పదవిని త్యాగం చేసి కేసీఆర్‌ను ఇక్కడి నుంచి పోటీ చేయాలని కోరినట్లు తెలిపారు. తాను ఇప్పటికే ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానని చెప్పారు. ఈ జీవితానికి ఇంతకుమించిన తృప్తి ఇంకా ఏముంటుందని అన్నారు. బుధవారం మండలంలోని ఉగ్రవాయి, రాఘవపూర్, క్యాసంపల్లి, క్యాసంపల్లి తండా, లింగయ్యపల్లి, కొట్టాలపల్లి, తిమ్మప్పల్లి గ్రామాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంజయ్య, జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, మాజీ జడ్పిటిసి గోపిగౌడ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మాచారెడ్డి : కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల లక్ష్మారెడ్డి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ముజీబుద్దిన్, మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగ రావు, మాచారెడ్డి జెడ్పిటిసి మినుకూరి రాంరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్

ఎన్నికలకు అంశాలను సాధారణ పరిశీలకుల దృష్టికి తేవాలి

• జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి శాసనసభ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి అంశాలైన సాధారణ పరిశీలకుల దృష్టికి తేవాలని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ బుధవారం తెలిపారు. సెలవు దినాలలో మినహా మిగతా అన్ని పనిదినాలలో సాధారణ పరిశీలకులు అందుబాటులో ఉంటారని అన్నారు. ఎన్నికలతో ముడిపడిన ఏ విషయమైనా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు పరిశీలకులను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు ఛిఫంగ్ అర్థుర్ వర్చ్యుయియో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో గల 101 గదిలో అందుబాటులో ఉంటారని అన్నారు. నేరుగా కలవలేని వారు 6304108748 ఫోన్ నెంబర్‌కు లేదా ఈ మెయిల్ generalobserverkm-rac@gmail;.comకు ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ సాధారణ పరిశీలకులు జి.జగదీశ్ సాయంత్రం 5 నుంచి 7.30 గంటల వరకు కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో గల రూమ్ నెంబర్ 101లో అందుబాటులో ఉంటారని, నేరుగా కలవలేని వారు 8143779448 నెంబర్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

సీఎం సభాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

• నేటి సిఎం సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజక వర్గంలోని డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద నిర్వహించ తలపెట్టిన ముఖ్యమంత్రి ఎన్నికల బహిరంగ సభాస్థలాన్ని బుధవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షులు ఈగ సంజీవ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లు చకచకా పూర్తి చేయాలని, ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూసుకోవాలని నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ మండల కేంద్రంలో జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభకు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుండి యాభై వేల మంది నుంచి తరలించే ఏర్పాట్లు చేశామని,ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపు నిచ్చారు. ఆయన వెంట ఒలింపిక్ జిల్లా అద్యక్షులు ఈగ సంజీవ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చింత శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు శక్కరి కొండ కృష్ణ, కమ్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలగార శ్రీనివాసరావు, యూత్ రూరల్ కన్వీనర్ అమీర్ ఖాన్,అలయ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, తో పాటు తదితరులు ఉన్నారు.



సీఎం సభా స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు